JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 27-07-2026
Medchal - Malkajgiri । Monday 27-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 56
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 56 । Pages : 8 । ₹: 5






# కొత్త రైల్వేస్టేషన్ ప్రారంభం

- మల్లన్న భక్తులు రెడీ అయిపోండి!
- సికింద్రాబాద్ నుంచి ఆ పుణ్యక్షేత్రానికి టికెట్ ధర రూ.25

**జయభేరి, హైదరాబాద్ :**

కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్‌ను కేంద్ర మంత్రులు ప్రారంభించారు. రూ.6 కోట్లతో నిర్మించిన ఈ స్టేషన్‌లో సికింద్రాబాద్‌సిద్దిపేట మార్గంలోని నాలుగు డెమూ రైళ్లకు హాల్ట్ కల్పించారు. ఈ రైల్వే స్టేషన్ నుంచి మల్లన్న ఆలయం కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో భక్తులకు ప్రయాణం సులభం కానుంది. ఇక సికింద్రాబాద్ నుంచి టికెట్ ధర కేవలం రూ.25 కాగా.. సిద్దిపేట నుంచి రూ.10గా నిర్ణయించారు. సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులకు శుభవార్త. కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభం అయింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్‌ను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు మాధవనేని రఘునందన్ రావు, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కే లక్ష్మణ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం తర్వాత.. కేంద్రమంత్రులు, ఎంపీలు కలిసి కొమురవెల్లి పుణ్యక్షేత్రం స్టేషన్ నుంచి సిద్దిపేటసికింద్రాబాద్ డెమూ రైలు నంబర్ 77654ను జెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత అదే రైలులో సికింద్రాబాద్‌కు ప్రయాణం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వే స్టేషన్ ప్రారంభం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ రైల్వే స్టేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కొమురవెల్లి మల్లన్న ఆలయం హైదరాబాద్‌కు సుమారు 85 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. ఇప్పటి వరకు భక్తులు బస్సులు, ఆటోలు మార్చుకుంటూ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఆలయానికి చేరుకోవాల్సి వచ్చేది. కొత్త రైల్వే స్టేషన్ ప్రారంభంతో మల్లన్న క్షేత్రానికి మరింత సులభతరంగా ప్రయాణం కానుందని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ నుంచి ఆలయం కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో భక్తులు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఆలయానికి చేరుకునే అవకాశం లభిస్తుంది. రూ.6 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన ఈ రైల్వే స్టేషన్ లకుడారం, దుద్దెడ స్టేషన్ల మధ్య నిర్మించారు. సికింద్రాబాద్‌సిద్దిపేట మార్గంలో నడిచే 4 డెమూ రైళ్లకు రెండు అప్, రెండు డౌన్ ఇక్కడ హాల్ట్ కల్పించారు. సికింద్రాబాద్ నుంచి కొమురవెల్లి వరకు టికెట్ ధర రూ.25 కాగా.. సిద్దిపేట నుంచి రూ.10గా నిర్ణయించారు. ఈ స్టేషన్ ద్వారా భక్తులతో పాటు స్థానిక విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు కూడా ప్రయోజనం పొందనున్నారు. కొమురవెల్లి ప్రాంత రవాణా సౌకర్యాల మెరుగుదలకు ఇది కీలక అడుగుగా నిలవనుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# టీ20లో జింబాబ్వే చిత్తు

- మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ భారత్ సొంతం
- రెండో టీ20లో జింబాబ్వేపై భారత్ ఘనవిజయం
- మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ కైవసం
- కెప్టెన్‌గా అయ్యర్‌కు తొలి సిరీస్ విజయం

**జయభేరి, హైదరాబాద్ :**

జింబాబ్వేతో హరారే వేదికగా శనివారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు 90 పరుగుల ఘన తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మరో మ్యాచ్ మిగిలుండగానే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 20తో సొంతం చేసుకుంది. టీ20 కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌కు ఇది మొదటి సిరీస్ విజయం కావడం విశేషం. మొదట బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ (81), తిలక్ వర్మ (60 నాటౌట్) రాణించడంతో భారత్ 219 పరుగులు చేయగా.. అనంతరం బౌలింగ్‌లో అభిషేక్ శర్మ 3 వికెట్లతో చెలరేగి జింబాబ్వేను 129 పరుగులకే ఆలౌట్ చేశాడు. జింబాబ్వేతో జరుగుతున్న టీ20 సిరీస్‌ను టీమిండియా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఛేజిక్కించుకుంది. శనివారం హరారే వేదికగా జరిగిన రెండో టీ20లో భారత్.. 90 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 219 పరుగులు చేసింది. అనంతరం జింబాబ్వేను 17.5 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌట్ చేసింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 20తో కైవసం చేసుకుంది. ఈ మ్యాచులో టాస్ గెలిచిన జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా.. తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో భారత్ బ్యాటింగ్‌కు దిగాల్సి వచ్చింది. గత మ్యాచులో హాఫ్ సెంచరీతో అదరగొట్టిన వైభవ్ సూర్యవంశీ 9 బంతుల్లో 20 రన్స్ చేసి ఔట్ అయ్యాడు. అభిషేక్ శర్మ (8) మరోసారి విఫలమయ్యాడు. ఈ సమయంలో ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 81 రన్స్), తిలక్ వర్మ (29 బంతుల్లో 60 రన్స్ నాటౌట్) రాణించారు. దీంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. అనంతరం ఛేజింగ్‌కు దిగిన జింబాబ్వే.. ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల దెబ్బకు ఆ జట్టు బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. అరంగేట్ర బౌలర్ యశ్ ఠాకూర్ 2 వికెట్లు తీశాడు. ప్రిన్స్ యాదవ్ సైతం 2 వికెట్లు పడగొట్టాడు. కానీ గాయం కారణంగా 1.2 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి మైదానాన్ని వీడాడు. భారత బౌలర్లలో అత్యధికంగా అభిషేక్ శర్మ 3 వికెట్లు తీశాడు. రవి బిష్ణోయ్, శివమ్ దూబె, తిలక్ వర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు. దీంతో జింబాబ్వే.. 17.5 ఓవర్లలో 129 పరుగులకు ఆలౌట్ అయింది. బ్యాట్‌తో అదరగొట్టిన ఇషాన్ కిషన్.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఈ విజయంతో భారత్.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను 20తో కైవసం చేసుకుంది. శ్రేయస్ అయ్యర్‌కు టీమిండియా టీ20 కెప్టెన్‌గా ఇదే తొలి సిరీస్ విజయం కావడం గమనార్హం. నామమాత్రపు మూడో టీ20 మ్యాచ్ రేపు అంటే జులై 26, 2026న జరగనుంది.




# ఏపీ ప్రజలకు చంద్రబాబు శుభవార్త

- ఆగస్ట్ నుండి మీ ఆరోగ్యం కోసం సంజీవని
- కర్నూలు జిల్లాలో సంజీవని లాంఛనంగా ప్రారంభించిన చంద్రబాబు
- ఆరోగ్యకరమైన రాష్ట్రం కోసం ఆరోగ్యకరమైన కుటుంబాలు
- ప్రభుత్వ ఆసుపత్రులలో కృత్రిమ మేధ డాక్టర్లను అందుబాటులో

**జయభేరి, విజయవాడ, జూలై 26 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు వైద్య రంగానికి చాలా ప్రత్యేకమైన ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు ఏపీలో కర్నూలు జిల్లాలో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు వెల్లడించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నెల నుండి సంజీవని కార్యక్రమం అందుబాటులోకి వస్తుందని సీఎం చంద్రబాబు ప్రకటించారు. సంజీవని కార్యక్రమంతో అన్ని ఆసుపత్రులు, ఏఎన్ఎం ల నుండి సూపర్ స్పెషాలిటీ డాక్టర్ల వరకు అందరూ ఒకే నెట్వర్క్ కిందకు వస్తారని ఆయన పేర్కొన్నారు.

**కర్నూలు జిల్లాలో సంజీవని లాంఛనంగా ప్రారంభించిన చంద్రబాబు**

కర్నూలు జిల్లా ఆస్పరి పిహెచ్సిలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన చంద్రబాబు సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజలు తమకు నచ్చిన డాక్టర్ తో, నచ్చిన ఆసుపత్రిలో వైద్య సేవలు పొందవచ్చని పేర్కొన్నారు. ఆన్లైన్లో లేదా ఆఫ్లైన్లో వైద్యులను సంప్రదించవచ్చని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఆలూరు, ఆస్పరి ప్రజలకు రాష్ట్రంలోనే అందరికంటే ముందుగా వైద్య సేవలు అందుతున్నాయని ఆయన తెలిపారు. ప్రతీ ఒక్కరి ఆరోగ్య చరిత్ర అందరికీ అందుబాటులో ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌరుని ఆరోగ్య వివరాలను ప్రభుత్వం సేకరించి భద్రంగా ఉంచుతుందని చంద్రబాబు తెలిపారు. పేషెంట్ యొక్క ఆరోగ్య వివరాలను ఆధార్ నెంబర్ చెప్పినా సరే వైద్యులు తెలుసుకునే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరి ఆరోగ్య చరిత్ర ఏ ఆసుపత్రిలో

...మిగతాది 2 లో

# ఇక నుంచైనా పార్లమెంట్ సజావుగా సాగేనా..?




**జయభేరి, న్యూఢిల్లీ:**

దేశ రాజధానిలో చెలరేగిన విద్యార్థుల నిరసన జ్వాలలు, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ఇన్నాళ్లూ కుదిపేశాయి. అయితే, మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, కాక్రోచ్ జనతా పార్టీ తన ఆందోళనను విరమించుకోవడంతో సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగుతాయనే ఆశిస్తోంది కేంద్రం. కానీ, ఇంతలోనే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖాస్త్రం సంధించారు. విద్యార్థులపై పోలీసులు ప్రయోగించిన పెల్లెట్ గన్‌లు, సాదా దుస్తుల్లో వచ్చి లాఠీలతో విరుచుకుపడిన వ్యక్తుల తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు రాసిన లేఖలో సూటిగా ప్రశ్నించారు రాహుల్ గాంధీ. ప్రాణాంతక ఆయుధాలు ప్రయోగించడానికి ఎవరు అనుమతించారు అంటూ పలు ప్రశ్నలు సంధించారు. సో, ఈ లేఖను చూస్తుంటే.. సోమవారం నాటి సెషన్స్‌లోనూ ఇదే టాపిక్ ఉండొచ్చని తెలుస్తోంది.

**హై-పవర్డ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు..**

ఇదే సమయంలో.. యువత భవిష్యత్తుతో చెలగాటమాడే పేపర్ లీక్ మాఫియా భరతం పట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేస్తోంది. ఈ మేరకు.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావులేకుండా పరీక్షా వ్యవస్థలో సాంకేతిక, నిర్మాణాత్మక సంస్కరణల కోసం వివిధ రంగాల నిపుణులతో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా విడుదల చేసిన వీడియోలో స్పష్టం చేశారు. మొత్తం ఆరుగురు సభ్యులతో కలిపి కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. టాస్క్‌ఫోర్స్ కమిటీ ఛైర్మన్‌గా టెక్ దిగ్గజం నందన్ నిలేకనినీ నియమిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్, IB మాజీ డైరెక్టర్ తపన్ డేకా, మద్రాస్ IIT డైరెక్టర్ కామకోటి, విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణులు అమృత్ లాల్ మీనా ఉన్నారు.




# 9 సార్లు సీపీఆర్ చేసి.. 'పెద్ది'ని బతికించిన వైద్యురాలు

- డాక్టర్ మమతా రెడ్డికి హరీష్ రావు కృతజ్ఞతలు

**జయభేరి, హైదరాబాద్ :**

గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డిని డాక్టర్ మమతా రెడ్డి ప్రాణాపాయం నుంచి కాపాడారు. వరుసగా 9 సార్లు ఆయనకు సీపీఆర్ చేసి.. తిరిగి గుండె కొట్టుకునేలా చేశారు. ఈ క్రమంలోనే డాక్టర్ మమతా రెడ్డి సేవలను మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశంసల జల్లు కురిపించారు. ప్రస్తుతం పెద్ది సుదర్శన్‌రెడ్డికి వెంటిలేటర్‌పై చికిత్స అందుతుండగా.. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు స్పష్టం చేశారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి గుండెపోటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఆయన ప్రాణాలను కాపాడిన వైద్యురాలు డాక్టర్ మమతా రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశంసల వర్షం కురిపించారు. అసాధారణమైన అంకితభావంతో, అవిశ్రాంతంగా శ్రమించి పెద్ది ప్రాణాలను కాపాడిన డాక్టర్ మమతా రెడ్డికి హరీష్ రావు.. ఎక్స్ వేదికగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గుండెపోటుకు గురై అత్యంత విషమ పరిస్థితిలో ఉన్నప్పుడు హనుమకొండలోని రోహిణి ఆస్పత్రికి తీసుకువచ్చిన పెద్ది సుదర్శన్‌రెడ్డికి డాక్టర్ మమతా రెడ్డి అత్యవసర చికిత్స అందించారు. ఆయన గుండె స్పందన పూర్తిగా ఆగిపోయిన పరిస్థితిలో వరుసగా 8 సార్లు సీపీఆర్ చేసినా స్పందన రాకపోయినా ఆమె ఆశ వదలలేదు. చివరికి 9వ సారి డాక్టర్ మమతా రెడ్డి చేసిన సీపీఆర్‌తో పెద్ది సుదర్శన్ రెడ్డి గుండె మళ్లీ కొట్టుకోవడం ప్రారంభమైంది. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆయనను గ్రీన్ చానల్ ద్వారా సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై స్పందించిన హరీశ్‌రావు.. అత్యంత ఒత్తిడిలోనూ డాక్టర్ మమతా రెడ్డి అసాధారణ నైపుణ్యం, ధైర్యం, నిబద్ధత ప్రదర్శించారని కొనియాడారు. ఆమె సేవలు వైద్య వృత్తి గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పాయని.. ఇలాంటి డాక్టర్లు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పెద్ది అన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## 9 సార్లు సీపీఆర్ చేసి..

ఇక హార్ట్ స్ట్రోక్ వల్ల పెద్ది సుదర్శన్ రెడ్డి శరీరంలోని అవయవాలపై ప్రభావం పడిందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ఆయన 72 గంటలు పూర్తిగా డాక్టర్ల అబ్జర్వేషన్లో ఉండాలని పేర్కొన్నాయి. ఆ తర్వాత డిశ్చార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపాయి. ఇదిలా ఉండగా.. సోషల్ మీడియాలో పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణించారంటూ ప్రచారం జరుగుతున్న వార్తలను రోహిణి ఆస్పత్రి డాక్టర్లు ఖండించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని.. ఐసీయూలో వెంటిలేటర్‌పై నిపుణుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. అలాగే అధికారిక వైద్య బులెటిన్‌ను మాత్రమే నమ్మాలని ప్రజలకు సూచించారు.

## సజావుగా సాగేనా..?

నేడు లోక్‌సభ ముందుకు 'పబ్లిక్ పరీక్షల అక్రమాల నిరోధక సవరణ బిల్లు 2026 రాబోతోంది. గత చట్టానికి మెరుగులు దిద్దుతూ తెస్తున్న ఈ సవరణ బిల్లు నిబంధనలు అత్యంత కఠినంగా ఉన్నాయి. యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, రైల్వేస్, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ పరీక్షలతో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే నీట్ , జేఈఈ, క్యూసెట్ వంటి అన్ని కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షలకు ఇది వర్తిస్తుంది. ప్రశ్నాపత్రాలు లేదా ఆన్సర్ కీలను లీక్ చేయడం, పరీక్షా కేంద్రాలలో ఇతరులకు అనధికారికంగా సహాయం చేయడం, ఓఎంఆర్ షీట్లతో ట్యాంపరింగ్ చేయడం, నకిలీ వెబ్‌సైట్లు లేదా అడ్మిట్ కార్డులను సృష్టించడం వంటి 15 రకాల చర్యలను అక్రమాలుగా ఈ చట్టం పరిధిలోకి తెస్తున్నారు. అయితే.. పరీక్షలు రాసే అభ్యర్థులు, విద్యార్థులను శిక్షల పరిధి నుంచి మినహాయించారు. కేవలం వ్యవస్థీకృత ముఠాలు, అసాంఘిక శక్తులు, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకే ఈ చట్టం వర్తిస్తుంది.

కాపీయింగ్, ప్రాక్సీ అభ్యర్థుల ద్వారా పరీక్షలు రాయించడం వంటి అక్రమాలకు పాల్పడితే ఇప్పటి వరకు ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించేవారు. ఇకపై పదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. దీంతో పాటు 50 లక్షల వరకు జరిమానా ఉంటుంది. ప్రశ్నాపత్రాల లీకేజీలు, వ్యవస్థీకృత అక్రమాలకు పాల్పడే పెద్ద ముఠాలు, లీక్ గ్యాంగ్‌ల నుంచి గరిష్ఠంగా 10 కోట్ల రూపాయల వరకు భారీ జరిమానా వసూలు చేయనున్నారు. అంతేకాదు, కేసు నమోదైన 2 నెలల్లోనే దర్యాప్తు పూర్తి చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 3 నెలల్లోపే తుది తీర్పు వచ్చేలా సత్వర న్యాయం అందించే నిబంధనలను ఈ బిల్లులో పొందుపరిచారు. అయితే.. ఈ కీలక బిల్లును ప్రవేశపెడుతున్న సమయంలో ప్రతిపక్షాలు ఎలా రెస్పాండ్ అవుతాయో చూడాలి. ఒకవైపు హోంమంత్రి జవాబుదారీతనంపై ప్రతిపక్షాల నిలదీత.. మరోవైపు పేపర్ లీక్ ముఠాలపై ఉక్కుపాదం మోపేలా సరికొత్త బిల్లు రూపకల్పన.. ఈ రెండు విభిన్న పరిణామాల నడుమ సోమవారం నాటి పార్లమెంట్ సమావేశాలు కేవలం సజావుగా సాగడమే కాదు, దేశ రాజకీయాల్లో అత్యంత వాడీవేడి చర్చలకు వేదిక కాబోతున్నాయి.

## ఏపీ ప్రజలకు చంద్రబాబు శుభవార్త

వైద్యులైన చూడవచ్చని సీఎం వివరించారు.

**ఆరోగ్యకరమైన రాష్ట్రం కోసం ఆరోగ్యకరమైన కుటుంబాలు**

రాష్ట్రంలో 80 లక్షల మందికి బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి తీవ్ర వ్యాధులు ఉన్నాయని పేర్కొన్న చంద్రబాబు, ఆహారపు అలవాట్లు జీవన శైలి మార్పుల కారణంగానే ఇలా అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. ఆరోగ్యకరమైన రాష్ట్రం కోసం ఆరోగ్యకరమైన కుటుంబాలు ఉండాలని, ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం ముందుకు వెళుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ప్రభుత్వ ఆసుపత్రులలో కృత్రిమ మేధ డాక్టర్లను అందుబాటులో ఉంచుతాం**

పెరుగుతున్న వ్యాధులు ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ ఆసుపత్రులలో కృత్రిమ మేధ డాక్టర్లను అందుబాటులో ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రెడిక్టివ్ అనలిటిక్స్, ఏఐ వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని, ఆహార సలహాలు కూడా ఏ ఐ ద్వారా అందిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ టవర్స్ పేరిట మోసాలు

- హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరిక
- అపరిచిత లింక్స్ ఓపెన్ చేయవద్దని సూచన



జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ క్యూర్ పరిధిలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్ కేటాయింపు ప్రక్రియను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేసే అవకాశం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. లబ్ధిదారులు, సాధారణ ప్రజలు సైబర్ మోసాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రూ.10 వేల ముందస్తు డిపాజిట్ పేరుతో సైబర్ కేటుగాళ్లు నకిలీ కాల్స్, మెసేజ్‌లు పంపే ప్రమాదం ఉందని ఆయన స్పష్టం చేశారు. 'ఈ రోజే ఆఖరు తేదీ, వెంటనే చెల్లించకపోతే ఇల్లు రాదు' అంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించి సులువుగా డబ్బులు గుంజడానికి నేరగాళ్లు ప్రయత్నిస్తారని తెలిపారు. అంతేకాకుండా.. వాట్సాప్ ద్వారా అపరిచిత లింకులు, APK ఫైళ్లను పంపి మొబైల్‌ను హ్యాక్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాంటి లింక్స్ అస్సలు ఓపెన్ చేయవద్దని చెప్పారు. అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్‌లను పోలి ఉండే నకిలీ వెబ్‌సైట్‌లను సృష్టించి అమాయకుల వ్యక్తిగత వివరాలను సైబర్ నేరగాళ్లు సేకరిస్తున్నారని సీపీ పేర్కొన్నారు. ఈ గృహనిర్మాణ పథకంలో దళారులకు, మధ్యవర్తులకు ఎలాంటి పాత్ర లేదని సజ్జనార్ స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆధార్ కార్డ్, బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్, ఓటీపీలను అపరిచితులకు ఎవరికీ ఇవ్వకూడదని తెలిపారు. స్క్రీన్ షేరింగ్, రిమోట్ యాక్సెస్ యాప్‌లను ఇతరుల మాటలు నమ్మి మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయకూడదని హెచ్చరించారు. డబ్బులు రీఫండ్ పొందడానికి ఎప్పుడూ యూపీఐ పిన్ ఎంట్రీ చేయాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా అజాగ్రత్త వల్ల సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రజలకు సూచించారు. కాగా, క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ గృహాల నిర్మాణం, దరఖాస్తు ప్రక్రియ, అర్హతలకు సంబంధించి ప్రజల సందేహాలను నివృత్తి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక హెల్ప్‌లైన్ కాల్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ హెల్ప్‌లైన్ నెంబర్ 040 24603572ను ప్రారంభించారు. ఈ కాల్ సెంటర్ ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుంది. దరఖాస్తుదారుల సౌలభ్యం కోసం తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ప్రజలు మధ్యవర్తులను నమ్మకుండా.. ఈ నెంబర్‌ను సంప్రదించి దరఖాస్తు విధానం, అర్హతలు తదితర వివరాలపై అధికారిక సమాచారం పొందాలని ప్రభుత్వం సూచించింది.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా..

## ఇది మోదీ ప్రభుత్వానికి ఎదురుదెబ్బా లేక ఒక పెద్ద అవకాశమా?



దిల్లీలో జంతర్ మంతర్ దగ్గర నెల రోజులకు పైబడి తనకు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనలు చేయడంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. మోదీ ప్రభుత్వానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఒక పెద్ద ఎదురుదెబ్బగా చూస్తున్నారు రాజకీయ విశ్లేషకులు. ఎందుకంటే, ఒక ఉద్యమం కారణంగా ప్రభుత్వ మంత్రులలో ఒకరు రాజీనామా చేయడం ఇదే తొలిసారి. అంతకుముందు కూడా, వివిధ సమస్యలపై కేంద్ర ప్రభుత్వంపై, మంత్రులపై ప్రతిపక్ష పార్టీలు ఒత్తిడి తెచ్చినప్పటికీ.. అది పెద్దగా ప్రభావం చూపలేదు. ఈ విషయంలో.. ''మోదీ ప్రభుత్వంలో రాజీనామాలు లేవు'' అని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ప్రకటన తరచూ చర్చనీయాంశమవుతోంది. రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పొగుడుతూ బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఒక పోస్టు చేశారు. ''భారతీయ విద్యా వ్యవస్థను సంస్కరించడంలో, చరిత్రాత్మక జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఈపీ 2020) విజయవంతంగా అమలు చేయడంలో కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ కీలక పాత్ర పోషించారు. ఇతర అనేక ముఖ్యమైన కార్యక్రమాలకు కూడా ఆయన నేతృత్వం వహించారు'' అని నితిన్ నబిన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో రాశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఇచ్చే సందేశమేంటి? అనే ప్రశ్నకు సమాధానం తెలుసుకునేందుకు బీబీసీ కొంతమంది నిపుణులతో మాట్లాడింది.

**'విద్యార్థుల ఉద్యమానికి చరిత్రాత్మక విజయం'**

2014 నుంచి మోదీ ప్రభుత్వ విధానాలపైన కావచ్చు, మరేదైన సమస్యపైన కావచ్చు... ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించిన సందర్భాలు చాలా ఉన్నాయి. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, ఉపాధి, నియామక పరీక్షలు, సీఏఏఎన్ఆర్సీ, ఎస్ఐఆర్ వంటి పలు అంశాలపై మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు, యువత వీధుల్లోకి వచ్చారు. కానీ, ఈ నిరసనలుగానీ, ఉద్యమాలుగానీ మోదీ ప్రభుత్వంపై పెద్దగా ప్రభావం చూపలేదు. ప్రధాని మోదీ, అమిత్ షా నాయకత్వంలో.. బీజేపీ ఒక ఎన్నిక తర్వాత మరొక ఎన్నికలో విజయం సాధిస్తూనే ఉంది. వారికి వ్యతిరేకంగా వచ్చిన ప్రతి సమస్యను చాకచక్యంగా తిప్పికొట్టింది. కానీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ జూన్ 20 నుంచి దిల్లీలో జంతర్ మంతర్ దగ్గర విద్యార్థులు నిరసన చేస్తూనే ఉన్నారు. జూలై 17 వరకు ఈ నిరసనలు పెద్దగా ప్రభావం చూపినట్లు కనిపించనప్పటికీ... జూలై 18 ఉదయం సోనమ్ వాంగ్‌చుక్‌ను దిల్లీ పోలీసులు జంతర్ మంతర్ నిరసన స్థలం నుంచి తొలగించి ఆసుపత్రిలో చేర్పించారు.

ఈ సంఘటన తర్వాత.. విద్యార్థుల డిమాండ్లకు పెద్ద ఎత్తున యువత నుంచి మద్దతు లభించింది. దీని తర్వాత.. జూలై 20న సీజేపీ పార్లమెంట్ మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఈ సమయంలో పోలీసు చర్యలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చాలామంది షేర్ చేశారు. ఆ తర్వాత.. రాజకీయాలు, క్రీడలు, సినిమాలు, కళలు, ఇతర ఎన్నో రంగాల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఫలితంగా జూలై 25న అంటే శనివారం విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

"ప్రధానంగా చెప్పాలంటే, ఇది గత 45 రోజులుగా పడిన తీవ్రమైన ఒత్తిడి ఫలితంగా సాధించిన విజయమే. విద్యార్థులకు మద్దతుగా దేశవ్యాప్తంగా నిరసనలు ప్రారంభమయ్యాయి. ముంబయి, పుణె, లఖ్‌నవూ, జైపూర్ ఇలా చాలాచోట్లా ఆందోళనలు మొదలయ్యాయి. ఇక బిహార్‌లోని పట్నా వంటి పెద్ద నగరాల గురించి చెప్పనక్కర్లేదు. ఖగౌల్ వంటి చిన్న ప్రాంతాల్లో కూడా యువత రోడ్లపైకి వచ్చారు. దర్భంగా, సివాన్, చాప్రా, ఔరంగాబాద్, జెహానాబాద్, షేక్‌పురా వంటి అనేక ప్రాంతాల్లో విద్యార్థులు రోడ్లపై నిరసన తెలిపారు" అని సీనియర్ జర్నలిస్ట్ లవ్ కుమార్ మిశ్రా అన్నారు.

**'ప్రభుత్వానికి ఎదురుదెబ్బే కానీ ఒక అవకాశం కూడా'**

ప్రతిపక్షాల నుంచి విద్యార్థుల వరకు ప్రతి ఒక్కరికీ ఇది ప్రయోజనకరమని సీనియర్ జర్నలిస్ట్ నీర్జా చౌధరి అన్నారు. "ప్రధాని మోదీకి, ఆయన ప్రభుత్వానికి ఇది పెద్ద ఎదురుదెబ్బ. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే, ఈ ఉద్యమం మరింత పెరిగేది. యువత ఆగ్రహాన్ని చల్లబర్చడానికి ఆయన రాజీనామా అవసరం'' అని అన్నారు. ప్రజాస్వామ్య మార్గాల ద్వారా మార్పు తీసుకురావచ్చని ఈ ఉద్యమం నిరూపిస్తుందని నీర్జా చౌధరి భావిస్తున్నారు. అయితే, సీనియర్ జర్నలిస్ట్ రషీద్ కిద్వాయ్ మాత్రం దీనిని ప్రభుత్వానికి ఒక షాక్‌గానూ, అలాగే ఒక అవకాశంగానూ చూస్తున్నారు.

**ప్రతిపక్షాలు చీలిపోతే ఏం జరుగుతుంది?**

''ఇలా జరిగితే, కేంద్ర ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ వంటి అనేక బిల్లులను ఆమోదింపజేసుకుంటుంది. అది వారికి చేజారిన ఆటను గెలిచినట్లు అవుతుంది" అని రషీద్ కిద్వాయ్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి శుక్రవారం చాలా క్లిష్టమైన రోజని నిరూపించింది. సీజేపీ, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు ఎటూ తేలకుండానే ముగిశాయి. పెల్లెట్ గన్‌తో గాయపడ్డ వ్యక్తితో కలిసి శుక్రవారం సాయంత్రం రాహుల్ గాంధీ మీడియా ముందుకు వచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై ఈ ఒత్తిడి శనివారం కూడా కొనసాగింది. మరోవైపు, దిల్లీలో జరిగిన 'విశ్వ మాంగళ్య సభ' కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కూడా ''కొత్త తరం ప్రశ్నలు అడుగుతోంది, వాటికి తార్కికంగా సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది'' అని వ్యాఖ్యానించారు.

"మేం చిన్నప్పుడు మా తల్లిదండ్రులు చెప్పిన విషయాలతో వాదించేవాళ్ళం కాదు. మాట్లాడొద్దు అంటే మాట్లాడే వాళ్లం కాదు. కానీ, ఇప్పుడు అలా లేదు, కొత్త తరం ప్రశ్నలు అడుగుతుంది, వారికి సమాధానాలు చెప్పాలి. నేటి తరానికి మరింత ఆప్యాయత అవసరం. మనం వారితో సమయం గడపాలి. మనం వారితో మాట్లాడాలి. ఈ రోజుల్లో కుటుంబాల మధ్య సంభాషణలు తగ్గిపోతున్నాయి. ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్లతో బిజీగా ఉన్నారు" అని ఆయన అన్నారు. దిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర, దేశంలోని అనేక ప్రాంతాల్లో విద్యార్థులు, యువత ఆందోళనలు చేస్తున్న తరుణంలో మోహన్ భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రభావం ఎలా ఉండొచ్చు?**

''ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వెనుకాల ఆర్ఎస్ఎస్ ఒత్తిడి, మోహన్ భగవత్ ప్రకటన కూడా ఉంటాయని నేను అనుకుంటున్నా. ఈ ఉద్యమానికి ఏ రాజకీయ నాయకుడూ నాయకత్వం వహించలేదు. ఇది విద్యార్థుల ఉద్యమం, విద్యార్థుల కోసం, విద్యార్థులతోనే నడిచింది. ఈ కోణంలో ఇది ప్రత్యేకమైనది" అని లవ్ కుమార్ మిశ్రా అన్నారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే, ఇది ప్రభుత్వ విశ్వసనీయతకు ముప్పుగా పరిణమించి ఉండేదని లవ్ కుమార్ మిశ్రా చెప్పారు. ''భారత్‌లో నిరుద్యోగంతో సహా అనేక సమస్యలను ఎదుర్కొంటున్న విద్యార్థులు, పేపర్ లీక్ కారణంగా ఒక్కసారిగా రోడ్డెక్కారు. ప్రభుత్వం ఇకపై దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది" అని తెలిపారు.

''యువతను బొద్దింకలతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలను చూస్తుంటే.. ఇప్పుడు వారు బొద్దింక అనే పదానికి కొత్త అర్థాన్ని వెతకాల్సి వస్తుందనిపిస్తోంది'' అని అన్నారు. ఒక కేసు విచారణ సందర్భంగా మే 15న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మాట్లాడుతూ.. ''కొంతమంది యువకులు ఉద్యోగాలు లేకపోవడం వల్ల, వారి వృత్తిలో రాణించకపోవడం వల్ల వాళ్లంతా బొద్దింకల్లా ప్రతి చోటకూ విస్తరిస్తారు'' అని వ్యాఖ్యానించారు. అయితే, సోషల్ మీడియాలో ఆయన వ్యాఖ్యలు వివాదాన్ని రేకెత్తించిన తర్వాత మే 16న జారీ చేసిన ఒక ప్రకటనలో, తన వ్యాఖ్యలు నకిలీ లేదా ఫోర్జరీ డిగ్రీలతో న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన వారికి వ్యతిరేకంగా మాత్రమేనని, దేశంలోని సాధారణ యువత గురించి కాదని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు.

అప్పటికే ఈ విషయంపై పెద్ద ఎత్తున చర్చ సాగింది. అభిజీత్ దీప్కే 'కాక్రోచ్' అనే పదంతో సోషల్ మీడియాలో హాస్యభరితంగా ప్రారంభించిన కార్యక్రమానికి వెల్లువెత్తిన మద్దతు చూసి, ఆయన ఏకంగా కాక్రోచ్ జనతా పార్టీనే ప్రారంభించారు.

''ఇది యువతకు లభించిన అతిపెద్ద విజయం. సమర్థవంతమైన రాజకీయ నాయకులను తయారు చేసింది. ఇది ప్రజాస్వామ్యానికి, అలాగే ప్రతిపక్ష పార్టీలకు కూడా ఒక అవకాశాన్ని ఇచ్చింది'' అని నీర్జా చౌధరి అన్నారు.

అయితే, ఈ విజయంలో ప్రతిపక్షానికి పెద్ద సవాలు ఎదురవుతుందని రషీద్ కిద్వాయ్ భావిస్తున్నారు. ''ప్రస్తుతం ప్రధాని మోదీ, ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టుల గురించి మాట్లాడుతుంది. అయితే, దీని వల్ల ప్రజలపై పెద్దగా ప్రభావం ఉండదు. కానీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందులో యూపీ ఎన్నికలు చాలా ముఖ్యమైనవి'' అని చెప్పారు. ''ఒకవేళ యూపీలో బీజేపీ మళ్లీ గెలిచి, పంజాబ్‌లో కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే.. అది అన్ని పార్టీలకు పెద్ద సందేశం అవుతుంది'' అని అన్నారు.




## బోనాల పండుగలో పోతరాజుల విన్యాసాలు

- ఘనంగా ఢిల్లీలో లాల్ దర్వాజా బోనాల పండుగ
- శ్రీ విఘ్నేశ్వర అకాడమీ గణేష్ మాస్టర్, డాక్టర్ శ్రీకాంత్ గౌడ మాస్టర్, లక్ష్మణ్ మాస్టర్

జయభేరి, హైదరాబాద్ :

దేశ రాజధాని ఢిల్లీలో లాల్ దర్వాజా బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. తెలంగాణ బోనాల ఉత్సవాలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి విశిష్ట కళాకారులతో తెలంగాణ భవన్ మారుమోగిపోయింది. ముఖ్యంగా ఈ ఉత్సవాల్లో అందరినీ ఆకర్షణ చేసిన బోనాలు, పోతరాజుల విన్యాసాలు అందర్నీ ఆకర్షించాయి. హైదరాబాద్ నుండి శ్రీ విఘ్నేశ్వర అకాడమీ గణేష్ మాస్టర్, డాక్టర్ శ్రీకాంత్ గౌడ మాస్టర్, లక్ష్మణ్ మాస్టర్ వారి కళాకారులుచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. తెలంగాణ భవన్ మాంకాళి అమ్మవారి బోనాల కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రికిషన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ శశాంక్ గోయల్ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల పండుగ తెలంగాణ ప్రజలకు భక్తి సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక. 12 ఏళ్లుగా ఢిల్లీలో బోనాల పండుగ నిర్వహిస్తున్న మహంకాళి దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులుకు అభినందనలు. ఢిల్లీలో బోనాలు నిర్వహించడం వల్ల తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక వైభవం దేశవ్యాప్తంగా పరిచయమవుతుంది.



## మాజీ సీఎం సిద్ధరామయ్య కీలక నిర్ణయం!



- కర్ణాటక రాజకీయాల్లో సంచలనం..

కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య సంచలన ప్రకటన చేశారు.ఇకపై తాను ఏ ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించారు. నేటి రాజకీయాల్లో వస్తున్న మార్పులు, వయసురీత్యా వస్తున్న అనారోగ్య సమస్యల కారణంగానే తాను ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. 2028లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఎలాంటి పరిస్థితుల్లోనూ పోటీ చేయబోనని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. వరుణా నియోజకవర్గ ప్రజలు తనపై ఒత్తిడి తెస్తున్నప్పటికీ, ఇకపై ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

గతంలో ఎన్నికలంటే నియోజకవర్గ ప్రజలే స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి గెలిపించేవారని, కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేటి రాజకీయాలు పూర్తిగా అవినీతిమయమయ్యాయని, ఎన్నికల్లో గెలవాలంటే డబ్బు కీలక పాత్ర పోషించే దుస్థితి వచ్చిందని విమర్శించారు. నిజాయితీ రాజకీయాలకు ప్రస్తుత వ్యవస్థలో ఆసరా లేకుండా పోయిందని ఆయన అభిప్రాయపడ్డారు. తనకు ప్రస్తుతం 79 ఏళ్లు అని, ప్రస్తుత ప్రభుత్వ పదవీకాలం ముగిసేనాటికి తన వయసు 81, 82 సంవత్సరాలకు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. వయసురీత్యా ఆరోగ్యం మునుపటిలా బలంగా లేకపోవడంతో, గతంలో ఉన్న ఉత్సాహంతో ఇకపై కష్టపడి పనిచేయడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించినట్లు సిద్ధరామయ్య గుర్తు చేసుకున్నారు.

2028 నాటికి తన రాజకీయ జీవితంలోకి వచ్చి సరిగ్గా ఐదు దశాబ్దాలు (50 ఏళ్లు) పూర్తవుతాయని తెలిపారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో ఓటములు, విజయాలను చూశానని, అయితే తాను నమ్మిన సిద్ధాంతాలకు, మనస్సాక్షికి వ్యతిరేకంగా ఎప్పుడూ ప్రవర్తించలేదని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనప్పటికీ, రాజకీయాల్లో ఎప్పుడూ క్రియాశీలకంగానే ఉంటానని, ప్రజల కష్టసుఖాలకు నిత్యం గొంతుకగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. గత ఐదు దశాబ్దాలుగా రాష్ట్ర ప్రజలు తనను ఆదరించి నడిపించారని, ఆ రుణం తీర్చుకోలేనిదంటూ తన భవిష్యత్ జీవితాన్ని కూడా పూర్తిగా ప్రజా సేవకే అంకితం చేస్తానని సిద్ధరామయ్య ప్రకటించారు.

# భక్తులతో కిటకిటలాడిన యాదగిరిగుట్ట

- స్వామివారి నిత్యరాబడి రూ.47.84 లక్షలు


**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 26 :**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం వారాంతం సెలవు కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆదివారం తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి శీఘ్ర దర్శనానికి 2 గంటలు, అతిశీఘ్ర దర్శనానికి గంట సమయం పట్టినట్టు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రూ.47,84,721 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,26,550, బ్రేక్ దర్శనం ద్వారా రూ.4,33,800, వీఐపీ దర్శనం ద్వారా రూ.7,19,550, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.7,08,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,05,496, ప్రసాద విక్రయం ద్వారా రూ.18,50,440, కల్యాణకట్ట ద్వారా రూ.81, 350తో పాటు వివిధ శాఖ,పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## ఆగస్ట్ 23న అమ్మవారి బోనాలు

- BJR నగర్ లో బోనాల పండుగ తేదీ ఖరారు సమావేశంలో పెద్దల ఏకాభిప్రాయంతో తీర్మాణం

**జయభేరి, జవహార్ నగర్ :**

జవహార్ నగర్ పరిధికి చెందిన బి.జే.ఆర్ నగర్ పాపయ్య నగర్, క్రిష్ణ నగర్, జ్యోతి రావు కాలనీ, దుర్గ భవానీ కాలనీ మరియు జ్యోతి రావు పూలే కాలనీల్లో ప్రజలంతా ఏకతాటిగా వుండి భక్తి శ్రద్ధలతో అమ్మ వార్లకు ఆగస్టు 23న బోనాలు సమర్పించాలని BJR నగర్ బోనాల ఉత్సవ సమితి నిర్ణయం తీసుకుంది. ప్రశాంత వాతావరణం లో బోనాల పండుగ ఉత్సవాలను జరుపుకోవాలని బి.జే. ఆర్ నగర్ గ్రామ పెద్దలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవార్లకు అత్యంత ప్రీతికరమైన ఆషాడం, శ్రావణమాసాలలో తరతరాల ఆనవాయితీ ప్రకారం అమ్మవార్ల బోనాల ఉత్సవాలను జరుపుకుంటున్న మాదిరిగానే ఆగస్టు 23 ఆదివారం రోజున బోనాల పండుగ కార్యక్రమాన్ని స్థానిక ప్రజలంతా ఏకతాటిగా వుండి భక్తి శ్లద్ధలతో అమ్మ వార్లకు ఆగస్టు 23న బోనాలు సమర్పించాలని బోనాల ఉత్సవ సమితి నిర్ణయం తీసుకోవడం జరిగింది. భక్తులందరూ బంధుమిత్రుల సపరివారంతో అమ్మవార్లకి బోనం నైవేద్యాలు సమర్పించడంతోపాటు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.



## SIR కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

- కంకణాల వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు

**జయభేరి, చింతపల్లి :**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి అన్నారు.అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు,ఓటర్ల వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకోవాలని సూచించారు. SIR ప్రక్రియలో భాగంగా అధికారులు,బూత్ స్థాయి సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో ప్రజలు వారికి సహకరించాలని ఆయన కోరారు.ప్రతి కుటుంబం తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైన పత్రాలు మరియు వివరాలను సక్రమంగా అందజేయాలని తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితా నుంచి తప్పిపోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు హక్కును కాపాడుకోవాలని ఆయన అన్నారు.

# వైభవంగా శేష వాహన సేవ

- సాంప్రదాయ రీతిలో చైర్మన్ అళ హరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పూజలు
- శేష వాహనంపై ఊరేగిన స్వామి వారు
- అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చిన స్వామివారు

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి శేష వాహన సేవ పవిత్ర పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చి సేవా పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారి శేష వాహన సేవ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన శేష వాహనంపై స్వామివారిని దేవస్థానం పురవీధుల గుండా ఊరేగించారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వైద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరినా మశ్చరణల మధ్య స్వామి వారి సేవ ముందుకు కదిలింది. ఈ సందర్భంగా దేవాలయంలోని రథ మండపంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తిరిగి మళ్ళీ శేష వాహనంపై గర్భగుడిలోకి ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు శేషవాహనంపై అలంకరణలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ దృశ్యాన్ని చూసి భక్తులు తన్మయం చెందారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ ,ఈఓ శ్రీనివాస రాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, దేవస్థానం పురహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాలనుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం. ఈ సందర్భంగా అధ్యక్షుడు NVT మాట్లాడుతూ ప్రతి ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటారని. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత సైన్యం విజయం సాధించిన, 527 మంది ప్రాణాలు త్యాగం చేసిన వీర జవాన్లను స్మరించుకునే ముఖ్యమైన రోజు ఇది అని, పాకిస్థాన్ సైనికులు లద్దాఖ్‌లోని కార్గిల్ పర్వత శిఖరాలను ఆక్రమించగా, వారిని తరిమి కొట్టేందుకు భారత్ ఈ సైనిక చర్య చేపట్టింది భీకర పోరాటం మంచుతో కూడిన కఠినమైన కొండలపై భారత సైనికులు సుమారు రెండు నెలల పాటు ప్రాణాలకు తెగించి పోరాడి విజయం సాధించారని, దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన 527 మంది వీర సైనికులకు ఈ రోజున ఘన నివాళులు అర్పించుకోవాల్సిన అవసరం తప్పనిసరి అని అన్నారు ముఖ్యంగా యువత గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, PJ శాంసన్ ,భాస్కర్ రెడ్డి, వల్లమళ్ల ఆంజనేయులు, తాళ్ల సురేష్ ,జగదీశ్వరాచారి, సైదులు ,నాగు, సంజీవ, రాజు, కుమార్, అంజి, వాసుదేవుడు, నాగార్జున ,అభిరామ్, చరణ్ ,వంశీ, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కటికనేని లక్ష్మణరావు 82వ జయంతి వేడుకలు



**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి మండలం అంగడిపేట గేట్ వద్ద కటికనేని లక్ష్మణరావు 82వ జయంతి వేడుకలు. ముఖ్య అతిథిగా పాల్గొని కటికనేని లక్ష్మణరావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్. అంగడిపేట గేట్ వద్ద గణపురం గ్రామానికి చెందిన మహనీయుడు కటికనేని లక్ష్మణరావు 82వ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాల వేసి మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కటికనేని లక్ష్మణరావు సేవలను స్మరించుకున్నారు. సమాజ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి ఆయన చేసిన విశేష కృషిని ఆయన కొనియాడరు. వారి ఆశయాలను భావితరాలు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కటికనేని లక్ష్మణరావు విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.

# అక్రమ నిర్మాణాలను నోటీసులతో సరిపెడతారా..?

- గుండ్లపోచంపల్లిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..
- అధికారుల తీరుపై విమర్శలు..
- మొక్కుబడిగా నోటీసులు జారీ చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

**జయభేరి, మేడ్చల్, జూలై 25:**




మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు రోజు రోజుకూ పెరుగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారి వెంట ఎలాంటి అనుమతులు లేకుండానే హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వాణిజ్య భవనాల నిర్మాణాలు ఇష్టానుసారంగా కొనసాగుతున్నా అధికారులు కేవలం నోటీసులు జారీ చేయడానికే పరిమితమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణాలు ప్రారంభ దశలోనే గుర్తించి నిలిపివేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అక్రమ నిర్మాణాలు పూర్తిస్థాయికి చేరుకుంటున్నాయని అంటున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన అనుమతి ఫీజులు, అభివృద్ధి చార్జీలు తదితర ఆదాయం దక్కకుండా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ "నోటీసులు జారీ చేశాం" అనే సమాధానంతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు లేకపోవడంతో అక్రమ నిర్మాణాలు యథావిధిగా కొనసాగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

దీంతో కొందరు అధికారుల మౌన వైఖరిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, అక్రమాలకు పరోక్షంగా సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు కూడా చేస్తున్నారు. జాతీయ రహదారి పరిసరాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాల వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రజా భద్రతకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను గుర్తించి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని వనభోజనాలు



**జయభేరి, తుర్కపల్లి, జూలై 26 :**

తుర్కపల్లి మండలం దయ్యం బండ తండా గ్రామపంచాయతీలో తండావాసులు వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని ఆదివారం వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నవీన్ నాయక్ ,పాల డైరీ చైర్మన్ నరేందర్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లచ్చిరాం నాయక్, మహేందర్ నాయక్, లక్ష్మణ్ నాయక్, మాజీ పాల డైరీ చైర్మన్ లక్ష్మణ్, చిన్న నాయక్, మాడోతు రవి నాయక్ ,మోహన్ నాయక్, ప్రవీణ్ నాయక్ ,రమేష్ నాయక్, అనిల్, జమ్మల నాయక్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జిఎంఆర్ కు సమస్యలు వివరించిన నాయకులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం లాల్ కోట గ్రామ సమస్యలను ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి జిఎంఆర్ కు ఆ గ్రామస్తులు వివరించారు. భూత్పూర్ మండలం కొత్త మొల్గరలలో వారు ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఈ సమస్యలను వివరించారు. సాధ్యమైనంత వరకు గ్రామ సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిసిన వారిలో గ్రామ సర్పంచ్ గోపాల్, ఉపసర్పంచ్ రవి, సీనియర్ నాయకుడు నరసింహులు, మైనార్టీ నాయకుడు మోయిన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎన్. వెంకటేష్, సీనియర్ నాయకుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి డివిజన్ లో సమగ్ర ఓటర్ల సవరణ కార్యక్రమం

- SIRపై ప్రజలకు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన తుంగతుర్తి రవి

**జయభేరి, మేడిపల్లి :**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ మేడిపల్లిలోని సాయిప్రియ నగర్, రోడ్ నెం.1లో సమగ్ర ఓటర్ల సవరణ (SIR) కార్యక్రమం పై సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన తుంగతుర్తి రవి.ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటరు సవరణ ఫారాలను నింపి సంబంధిత బీఎల్ఓలకు (BLO) అందజేశారు. ఈ సందర్భంగా 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రతి ఓటరుకి ఎంతో ముఖ్యమైనదని అన్నారు.ఫారం నింపటం లో సందేహం ఉన్నవారికి సహాయం చేయటానికి ఏర్పాటు చేసిన ఈ help సెంటర్ లో చాలా మంది పాల్గొని వారి ఫారాలను నింపి Blo లకు అందజేశారని అన్నారు. ఈ సహాయ కేంద్రం ద్వారా ఓటర్లకు సహాయం చేసిన సంబంధిత అధికారులకు, BLO లకు,BLA లకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి డివిజన్ sir ఇంచార్జ్ లు బాల్ రెడ్డి, సత్యనారాయణ, కోమలత, రాకేష్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, సుదర్శన్ రెడ్డి,అమర్ నాథ్, వెంకటేష్ గౌడ్, ప్రణయ్, NNK దుర్గ, తండా పరమేశ్వరి, శ్రీలత, సరిత పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై పార్టీ నాయకుల సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి

- ఎస్ఐఆర్ ప్రక్రియలో రాష్ట్రంలో 4వ స్థానంలో పరకాల పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే అభినందనలు
- పరకాలలో గ్రూపు రాజకీయాలకు తావులేదు అధిష్టానం మాటే సుప్రీం
- రానున్న ఎన్నికల్లో టీం వర్క్ గా పనిచేసి పరకాల గడ్డపై మరోసారి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తాం
- డబ్బు రాజకీయాలకు దూరంగా ఉండండి నిబద్ధతతో పనిచేసేవారే నాతో ఉండాలి



**జయభేరి, పరకాల, జులై 26:**

ఆదివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఎస్ఐఆర్ ప్రక్రియ లో భాగంగా కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ లు, క్లస్టర్ ఇన్చార్జిలు, మండల, పట్టణ, డివిజన్ అధ్యక్షులతో, మాజీ అధ్యక్షులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం క్లస్టర్ ఇంచార్జిలు, బి ఎల్ ఎ లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో రాష్ట్రంలో 119 నియోజకవర్గాలలో పరకాల నియోజకవర్గానికి 4వ స్థానం రావడం గర్వంగా ఉందని, మనస్ఫూర్తిగా బిఎల్ఏలు, క్లస్టర్ ఇన్చార్జులు, మండల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులను, కాంగ్రెస్ పార్టీ నాయకులను అభినందించారు. కార్యకర్తలు కమిటెడ్ గా పనిచేస్తే ఫలితాలు వస్తాయని చెప్పడానికి నిదర్శనమని అన్నారు.



కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారికి తగిన గుర్తింపు, గౌరవం ఇస్తానని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల కన్నా రెట్టింపు ఉత్సాహంతో ఎస్ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేశారని, అన్ని మండలాల్లో 100% ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి అయినదని అన్నారు. రాబోయే ఏ ఎన్నికలైన టీంగా పనిచేసి, కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తాం అని అన్నారు. పరకాల నియోజకవర్గం లో గ్రూపు రాజకీయాలను సహించను అని, అధిష్టానం చెప్పినది సుప్రీం అన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని, నిజాయితీగా పనిచేయాలని అన్నారు. నామినేట్ పదవులలో, పార్టీ పదవులలో ఈ టీం సభ్యులకు ప్రయారిటీ ఇస్తానని అన్నారు. రాష్ట్రంలోనే బెస్ట్ గా పరకాల ఇందిరా మహిళల డైరీ ఏర్పాటు చేయబోతున్నామని, ఈ డైరీలో పార్టీలకు అతీతంగా సభ్యులు ఉన్నారన్నారు. రైతు సొసైటీలను కూడా అభివృద్ధి చేస్తామన్నారు. రైతులు ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి సాధించాలని, రాబోయే 2 సంవత్సరాలలో రైతులకు మార్కెటింగ్ సౌకర్యం, సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు అందిస్తామని అన్నారు. ప్రాథమిక రైతు సొసైటీల ద్వారా రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నిజాయితీగా, నిబద్ధతగా గౌరవంగా ఉండేవారు నాతో ఉండండి, డబ్బే ముఖ్యం అనుకునే వారు దూరంగా ఉండాలన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు.




## గంజాయి రహిత సమాజ నిర్మాణానికి కృషి చెయ్యండి

- భరిణికం గ్రామంలో గంజాయి నిర్మూలనపై పోలీస్ శాఖ అవగహన కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం బర్నికం గ్రామంలో వందరోజులా గంజాయి వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో భాగంగా పరవాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సీహెచ్ భీమరాజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ భీమరాజు మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల విక్రయాలు రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బర్నికం గ్రామ మాజీ సర్పంచ్ పెద్దశెట్టి శేఖర్ గ్రామ పెద్దలు సుమారు 50 మంది యువత పాల్గొని గంజాయి నిర్మూలనకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.పరవాడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా యువతలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించి మత్తు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## మేడ్చల్ ఫ్లైఓవర్ పనులు పునఃప్రారంభించాలి

- ఎంపీ ఈటల రాజేందర్‌కు మాజీ కౌన్సిలర్ ఉమా నాగరాజు వినతి



**జయభేరి, మేడ్చల్, జూలై 26:**

మేడ్చల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 44)పై నిలిచిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించి, దెబ్బతిన్న రహదారిని పూర్తిస్థాయిలో పునర్నిర్మించేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పనులు జరిగేలా చూడాలని కోరుతూ మేడ్చల్ బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ ఉమా నాగరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో మేడ్చల్ ఎన్‌హెచ్ 44పై ఫ్లైఓవర్ పనులు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి అత్వెల్లి వరకు జాతీయ రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారిందని తెలిపారు. దెబ్బతిన్న రహదారి కారణంగా ఇప్పటికే అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులను తక్షణమే ప్రారంభించడంతో పాటు మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి అత్వెల్లి వరకు ఉన్న రహదారిని నూతనంగా నిర్మించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేయాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగరాజు ముదిరాజ్, లాయక్ అలీ, బాలరాజ్ ముదిరాజ్, బాల మల్లేష్ యాదవ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పుష్పాలంకరణ మహోత్సవంలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్ లో ఆదివారం శ్రీనివాసులు కుమార్తె సభా కుమారి పుష్పాలంకరణ మహోత్సవ కార్యక్రమంలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారిని మాజీ ఎమ్మెల్యే ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ తల్లి బోనాల పండుగ



**జయభేరి, సైదాపూర్ :**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల్ దుద్దునపల్లి గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేకగా నిలిచే గ్రామదేవతల పోచమ్మ తల్లి ఒకరు. ఈమె వర్షాలు, పంటలు, అంటువ్యాధుల నుండి కాపాడే శక్తి స్వరూపిణిగా గ్రామ ప్రజలు పూజిస్తారు. గ్రామంలో మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను ఎత్తిన పెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలుతో పాటు మేకపోతు బలిని సమర్పించి.. తమ మొక్కులను చెల్లించుకున్నారు. పోచమ్మ తల్లి గ్రామంలో ప్రజలను ముఖ్యంగా పిల్లలను ఎలాంటి అనారోగ్యాలు, అంటు వ్యాధులు రాకుండా కాపాడాలని గట్టి నమ్మకంతో ఈ పూజలు జరుపుకుంటున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ భర్త

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కనిమెట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త గాదం పరమేష్ ఆదివారం దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే వైస్ ఎంపీపీ వాకిటి బాలరాజు, మాజీ ఉపసర్పంచ్ ముంత పర్వతాలు, మాజీ వార్డు సభ్యులు వాకిటి పరశురాం, మొల్ల ఖాసిం, గాని రామారెడ్డి, పేరి శేఖర్ రెడ్డి తదితరులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే జిఎంఆర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్ని విధాల సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజాపాలనను చూసి మేము అందరం పార్టీలోకి వస్తున్నట్లు వారికి తెలిపారు. అంతే కాకుండా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దేవరకద్ర నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, డిసిసి జిల్లా కార్యదర్శి పాపయ్య, కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నాగారపు బీచుపల్లి, చర్లపల్లి మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నరుకుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## కాలనీలో రౌడీ మూకల ఆట కట్టించాలి

- దేవేందర్ నగర్ కాలనీవాసులకు అండగా రాజకీయ నాయకులు
- మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చిన అఖిలపక్షం సభ్యులు
- అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్, సిపిఐ, జనసేన నాయకులు



**జయభేరి, మేడిపల్లి :**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలో గత కొంతకాలంగా జరుగుతున్న దాడులు, గొడవలు నేపథ్యంలో కాలనీలో ప్రశాంత వాతావరణం నెలకొనాలని లక్ష్యంతో గత నెలలో గృహప్రవేశం జరుగుతున్న ఇంటి సభ్యుల పైన, అలాగే స్థానిక రిపోర్టర్ విష్ణు గౌడ్ ఇంటిపై రౌడీ గ్యాంగులు, గాంజా మూకలు రాళ్ల దాడి, కారు బైకుల ధ్వంసం ఘటనలో నిందితులపై బాధితులు మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ దాడికి ప్రధాన కారకులైన వ్యక్తులను కాకుండా ఇతర వ్యక్తులను అరెస్ట్ చేసి చేతులు దులుపుకున్నారని, తక్షణమే గొడవకు కారణమైన జెన్నరాజు, జెన్నినాగరాజు, సానిక ప్రశాంతు, హరీష్ అతని అనుచరులందరినీ తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దేవేందర్ నగర్ కాలనీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్, సిపిఐ, జనసేన, మొదలైన పార్టీ నాయకులు పాల్గొని బాధితులను, కాలనీవాసులను సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా ప్రజల శాంతిభద్రతలకు విగాదం కలిగించే ఎవరినైనా క్షమించరాదని, దేవేందర్ నగర్ కాలనీలో గొడవలకు ప్రధాన కారకుడుగా భావిస్తున్న జెన్నరాజు, జెన్న నాగరాజు, సానిక ప్రశాంతు, హరీష్, స్థానిక యువకులకు మత్తు పదార్థాలను అలవాటు చేసి ఆయన అవసరాల కోసం పలు గొడవలలో వారిని వాడుకుంటున్నారని, చాలామంది యువత మద్యం గంజాయి వంటి మతపదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, పలువురు బాధితులు లబోదిబోమన్నారు. అనంతరం పలువురు రాజకీయ నాయకులు మాట్లాడుతూ దేవేందర్ నగర్ కాలనీ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, ఈ సంఘటనలో పోలీసుల వ్యవహారం కొంతమంది నాయకులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని అనుమానం వ్యక్తపరుస్తున్నారు. ఈ సంఘటనలోని ప్రధాన నిందితులను అరెస్ట్ చేసే వరకు అఖిలపక్షం సభ్యులందరూ కాలనీవాసులకు అండగా ఉంటామని తెలుపుతూ సోమవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ రాపోలు రాములు, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్, బోడుప్పల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి, జక్క రాములు, టిఆర్ఎస్ నాయకులు శ్రీధర్ గౌడ్, మేడ్చల్ జిల్లా బిజెపి నాయకులు జెనీగ వెంకటేష్, మేడిపల్లి మండల సిపిఐ పార్టీ అధ్యక్షులు రచ్చ కిషన్, జనసేన పార్టీ నాయకుడు సాయికుమార్, దేవేందర్ నగర్ కాలనీ అధ్యక్షుడు దయ్యాల మహేష్, జనరల్ సెక్రటరీ తాటికాయల యాదగిరి, అంబేద్కర్ నగర్ అధ్యక్ష దేశపాక నరసింహ, నాయకులు ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, గడ్డం యాదగిరి, దండు రమేష్, బాలస్వామి, పంగ రమేష్, భగవంతు, సదానంద్, కాలనీ కమిటీ సభ్యులు పండుగ యాకయ్య, అఫ్జల్, వెంకటేష్, మారపాక మధు, ఆరోగ్యం, మహిళలు నర్సమ్మ, పద్మ, జంగమ్మ, లావణ్య, శ్రీలత, రేణుక, అంజమ్మ, ఉప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.





## రైతుల వ్యవసాయ బోర్లు అధిక విద్యుత్ బిల్లుల సమస్యకు పరిష్కారం

- సమస్యపై అధికారులకు వెన్నలపాలెం మాజీ ఉపసర్పంచ్ ఫిర్యాదు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం వెన్నెలపాలెం గ్రామంలోని సుమారు 35 మంది రైతుల ఉచిత వ్యవసాయ విద్యుత్ మోటార్లకు సాంకేతిక సమస్యల వల్ల వెలలో విద్యుత్ బిల్లులు రావడం జరిగింది దీనిపై రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేసారు.ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మే 18నా స్థానిక పరవాడ జెఎన్పిసి విద్యుత్ శాఖ సెక్షన్ ఏఈ శేష సాయికి వెన్నెల పాలెం మాజీ ఉపసర్పంచ్ వెన్నెల సన్యాసిరావు ఆధ్వర్యంలో 35 మంది రైతులు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు.అర్బన్ 24 గంటల ఫీడర్ లైన్‌కు అనుసంధానం కావడం వల్ల ఈ లోపం తలెత్తినట్లు రైతులు తెలిపారు. రైతుల సమస్యపై తక్షణమే స్పందించి ఏఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. అధికారుల చొరవతో రైతుల విద్యుత్తు వ్యవసాయ మోటార్ బిల్లులు సరికావడంతో పాటు విద్యుత్ బిల్లుల సమస్య పూర్తిగా తొలగిపోవడంతో సమస్య సకాలంలో పరిష్కారం కావడంతో వెన్నెలపాలెం గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల కష్టాన్ని అర్థం చేసుకుని స్పందించిన ఏపీ ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులకు,ఏఈ శేషసాయికి రైతులు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

## శ్రీ తుల్జా భవానిఅమ్మవారి దర్శించుకున్న వడ్త్యా రమేష్

**జయభేరి, నేరడు గోమ్ము :**

నేరేడు గోమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామంలో కొలువైన బంజారాల ఆరాధ్య దైవం శ్రీ తుల్జా భవాని అమ్మవారి ఆలయాన్ని దర్శించుకునీ ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ అమ్మవారి ఆలయ శిఖర కలశం బంగార తపడం కావాలని BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్యా రమేష్ నీ గుడి పూజారి తండా పెద్దలు ప్రజలు కోరగా దాని ఏర్పాటు మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గుడి పూజారి కేతవత్ జీవన్ కుమార్,BRS పెద్దమునగల్ సర్పంచ్ కేతవత్ రవీందర్, జబ్బార్ నాయక్, బోడ నాయక్,కుంభం నరేష్, ధరం సింగ్, రామ కృష్ణ, నరసింహ నాయక్, మహేష్, ధాకు, నాన్కు, శక్రు, బొజ్య, జగన్ తండా ప్రజలు తదితరులు పాల్గొనారు.

# మిరాయి భామ కొరియన్ గాళ్‌గా మారితే..



అశోకవనంలో అర్జున కళ్యాణం సినిమాలో సెకండ్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో మెరిసి తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది రితికా నాయక్. ఆ తర్వాత మిరాయి సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఈ బ్యూటీ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టింది. వీటిలో ఒకటి డ్యుయెట్ కాగా.. మరో సినిమా కొరియన్ కనకరాజు. ఇండోకొరియన్ హార్రర్ కామెడీ నేపథ్యంలో వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న చిత్రం కొరియన్ కనకరాజు. మేర్లపాక గాంధీ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీ ఆగస్టు 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ భామ రీసెంట్‌గా కొన్ని ఫోటోలను నెట్టింట దర్శనమిచ్చి అందరినీ మెస్మరైజ్ చేస్తోంది. వైబ్రాంట్ ఫ్లోరల్ స్కర్ట్, వైట్ షర్ట్ వేసుకున్న రితికా నాయక్ గోల్డెన్ కలర్ జ్యువెలరీతో తళుక్కున మెరుస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. మిరాయి బ్యూటీ కొరియన్ గర్ల్‌గా మారితే ఇలా ఉంటుందని చెప్పకనే చెబుతూ కుర్రకారు గుండెలను పిండేస్తుంది రితికానాయక్. చబ్బీచబ్బీగా క్యూట్ లుక్ స్టిల్స్ సోషల్ మీడియాలో రౌండప్ చేస్తున్నాయి.




# జయకృష్ణ మొదటి సినిమా కోసం ఎగ్జైటింగ్‌గా ఉన్నాం..

**'శ్రీనివాస మంగాపురం'పై మహేష్ బాబు**


సూపర్ స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో హీరో వస్తున్నాడు. దివంగత రమేష్ బాబు తనయుడు జయకృష్ణ మరో మూడు రోజుల్లో వెండితెరపై కనిపించనున్నాడు. అతను హీరోగా నటించిన మొదటి సినిమా శ్రీనివాస మంగాపురం జులై 30న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఆర్ఎక్స్ 100, మంగళవారం వంటి డిఫరెంట్ సినిమాలు తీసిన అజయ్ భూపతి జయకృష్ణ డెబ్యూ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడు. బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ రవీనాటాండన్ కూతరు రషా తడానీ ఈ మూవీలో హీరోయిన్ గా నటిస్తోంది. తిరుపతి పుణ్యక్షేత్రం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ ప్రేమకథా చిత్రం ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకుంది. ఈ నెల 30న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో జయకృష్ణతో పాటు శ్రీనివాస మంగాపురం చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్ చెబుతూ ఒక వీడియోను రిలీజ్ చేవారు. తన అన్నయ్య రమేష్ బాబు తనయుడు జయ కృష్ణ ఘట్టమనేని డెబ్యూ చేస్తున్న 'శ్రీనివాస మంగాపురం' సినిమా గురించి మహేష్ బాబు స్పందించారు. జయకృష్ణ డెబ్యూ గురించి తమ కుటుంబం అంతా ఎగ్జైటింగ్‌గా ఉన్నామని.. కచ్చితంగా ఈ సినిమాతో జయకృష్ణ, రషా హిట్ అందుకుంటారని నమ్మకంగా తెలిపారు మహేష్. తన 'రాజకుమారుడు' విడుదలైన జూలై 30నే 'శ్రీనివాస మంగాపురం' విడుదలవుతుందని.. ఇది కచ్చితంగా అశ్వినీదత్ ప్లాన్ చేసుంటారని చెప్పారు సూపర్ స్టార్. మరి జయకృష్ణ గురించి మహేష్ ఇంకేం మాట్లాడారో ఈ వీడియోలో చూద్దాం రండి.

# రామ్‌చరణ్‌కు సర్జరీ



అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ మణికట్టు సర్జరీ నిమిత్తం కోయంబత్తూరు పయనమయ్యారు. అక్కడి గంగా ఆసుపత్రిలో ఆయనకు సర్జరీ జరుగనున్నది. ప్రత్యేక వైద్య నిపుణులు ఈ సర్జరీని నిర్వహించనున్నారు. 'పెద్ది' సినిమా షూట్‌లో రామ్‌చరణ్ మణికట్టుకు గాయమైన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ సినిమా ప్రచార కార్యక్రమాల్లో ధాటిగా పాల్గొన్నారాయన. సర్జరీ సమయంలో రామ్‌చరణ్‌కు తోడుగా ఆయన సతీమణి ఉపాసనతోపాటు తల్లిదండ్రులు సురేఖ, చిరంజీవి కూడా కోయంబత్తూరు వెళ్లినట్టు సమాచారం.

# 'స్పిరిట్'లో కత్రినా కైఫ్ .. ప్రభాస్ సినిమాపై బాలీవుడ్‌లో హాట్ టాక్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'స్పిరిట్'. అనౌన్స్‌మెంట్ జరిగిన నాటి నుంచే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ మూవీకి సంబంధించి బాలీవుడ్‌లో ఓ ఆసక్తికరమైన వార్త వైరల్‌గా మారింది. అదేంటంటే.. స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం.

'స్పిరిట్'లో ఇప్పటికే హీరోయిన్‌గా తృప్తి డిమ్రి నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మరో హీరోయిన్‌గా కాకుండా, కథలో కీలక మలుపు తీసుకొచ్చే ప్రత్యేక పాత్ర కోసం కత్రినా కైఫ్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు ముంబై సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

స్క్రీన్‌పై ఆమె కనిపించే సమయం పరిమితంగానే ఉన్నప్పటికీ, కథను ప్రభావితం చేసే పవర్‌ఫుల్ రోల్‌లో కత్రినా కనిపిస్తారని టాక్ వినిపిస్తోంది. ఆమె పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని కూడా వార్తలు వస్తున్నాయి. ప్రారంభంలో ఈ సినిమాలో హీరోయిన్‌గా దీపికా పదుకొణె పేరు వినిపించింది. అయితే ఆమె ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్న తర్వాత తృప్తి డిమ్రిని హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఇప్పుడు కత్రినా కైఫ్ పేరు తెరపైకి రావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి పెరిగింది. కత్రినా కైఫ్ గతంలో విక్టరీ వెంకటేష్‌తో 'మల్లీశ్వరి', నందమూరి బాలకృష్ణతో 'అల్లరి పిడుగు' చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత ఆమె పూర్తిగా బాలీవుడ్‌కే పరిమితమయ్యారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఆమె స్పిరిట్ లో నటిస్తే, అది ఆమెకు చాలా కాలం తర్వాత తెలుగు సినిమా అవుతుంది. ప్రస్తుతం కత్రినా కైఫ్ 'స్పిరిట్'లో నటిస్తున్నారనే వార్త సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొడుతోంది. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు కత్రినా కైఫ్ గానీ, చిత్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా గానీ, నిర్మాణ సంస్థ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ఈ వార్తపై స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



# మనసులో మాట బయటపెట్టిన హాట్ బ్యూటీ..

టాలీవుడ్‌లో మోస్ట్ గ్లామరస్ బ్యూటీగా పేరు తెచ్చుకుంది ఈ చిన్నది. ఇప్పుడు యాక్షన్ సీన్స్ చేయాలని ఉంది అంటూ చెప్పుకొచ్చిన ఆమె ఎవరో కాదు మాళవిక మోహనన్. హీరోయిన్ మాళవిక మోహనన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇన్నాళ్లు తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు రాజా సాబ్ సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో వచ్చిన ఈ సినిమా భారీ అంచనాల మధ్య విడుదలై బోల్తా కొట్టింది. 2013లో పట్టం పోలే సినిమాతో మలయాళీ సినీరంగంలోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రజినీకాంత్ హీరోగా నటించిన పేట్టా చిత్రంలో కనిపించింది. ఈ మూవీతో తమిళం ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత కోలీవుడ్ ఇండస్ట్రీలో వరుస ఆఫర్స్ అందుకుంది. ధనుష్, విజయ్ దళపతి వంటి స్టార్ హీరోలతో కలిసి నటించిన మాళవిక.. ఇక ఇప్పుడు యాక్షన్ ఎంటర్టైనర్ రోల్స్ చేయాలని ఉందని తెలిపింది. అలాగే ఇండస్ట్రీలో మహిళా మేకర్స్ పెరగాలని, లాపత లేడీస్ సినిమా నన్ను బాగా ఆకట్టుకుంది. కిల్ బిల్ లాంటి పాత్ర చేయాలని ఉందని చెప్పుకొచ్చింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**